క్లుప్తంగా

సింగరేణి ఆధ్వర్యాన వేసవి క్రీడా శిబిరం


మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024–25 సంవత్సరానికి గాను బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్ క్రీడలకు సంబంధించి 18 ఏళ్లలోపు ఇల్లెందు ఏరియాలో పని చేస్తున్న సింగరేణి ఉద్యోగుల పిల్లలకు వేసవికాల క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్నట్లు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. బుధవారం ఇల్లెందులో మాట్లాడుతూ... సింగరేణి ఇల్లెందు 24 ఏరియా రన్స్ అండ్ గోల్స్ స్టేడియం, సింగరేణి జేకే స్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 25 నుంచి 25 రోజుల పాటు ఉదయం 6 గంటల నుంచి 8 వరకు, సాయంత్రం 5.30 గంటల నుంచి 7 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొనదలిచినవారు జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగం, సేవా సమితి కార్యాలయంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నాసిరకంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు


మాట్లాడుతున్న ఐలయ్య


సుజాతనగర్: మంగపేట, వేపలగడ్డ గ్రామాల మధ్యలో నాసిరకంగా చేపడుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య అన్నారు. బుధవారం గ్రామస్తులు చేపట్టిన ఆందోళనకు సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ... నాసిరకం పనుల వల్ల బ్రిడ్జి కూలిందన్నారు. ఇప్పటికే ముగ్గురు మృతి చెందినట్లు చెప్పారు. పనులు జరుతున్న సమయంలో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ఉండటం లేదని, దీని వల్ల కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా చేస్తున్నాని, భవిష్యత్‌లో మరింత నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. సదరు కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలన్నారు. ధర్మ, వీర్ల రమేశ్, పుల్లయ్య, కృష్ణ, భాస్కర్, హతిరాం పాల్గొన్నారు.

కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించండి..


మాట్లాడుతున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోడేటి నాగేశ్వరరావు, సారంగపాణి డిమాండ్ చేశారు. మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో బుధవారం ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. కొలతలతో నిమిత్తం లేకుండా కూలీలకు రోజుకు రూ.750 చెల్లించాలని, పనికి ఉపయోగించే సామగ్రిని ప్రభుత్వమే సమకూర్చాలని డిమాండ్ చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి మెరుగైన వేతనాలు చెల్లించాలని కోరారు.

భూనిర్వాసితుల ఆందోళన


కంకర టిప్పర్‌ను అడ్డుకుంటున్న నిర్వాసితులు

జూలూరుపాడు: సీతారామ కెనాల్ కింద భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతూ బుధవారం భూ నిర్వాసితులు కెనాల్ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన కంకర టిప్పర్ వాహనాలను అడ్డుకున్నారు. భూ నిర్వాసితులు మాట్లాడుతూ... కెనాల్ నిర్మాణంతో సుమారు 55 ఎకరాల పోడు భూమి కోల్పోయామని, ఐదేళ్లుగా నష్టపరిహారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు లేకపోయినా నష్టపరిహారం ఇస్తామని నాటి కలెక్టర్ చెప్పారని, ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదన్నారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, అటవీశాఖ అధికారులు కూడా సందర్శించి, జాయింట్ సర్వే నిర్వహించినట్లు చెప్పారు. నష్టపరిహారమైనా ఇవ్వాలి, లేకపోతే తాము కోల్పోయిన భూమి కింద భూమి ఇవ్వాలని భీష్మించుకున్నారు. దీంతో టిప్పర్ వాహనాలను వెనక్కి తీసుకెళ్లడంతో ఆందోళన విరమించారు. ధరావత్ రవి, బానోత్ చిల్కి, బానోత్ శంకర్, గుగులోత్ రాందాస్, ధరావత్ రాజేలా, ధరావత్ జ్యోతిబాస్, బోడా భోజ్యా, ధరంసోత్ సక్రు, గుగులోత్ బిచ్యా, తాళ్లూరి పెద్ద వీరయ్య పాల్గొన్నారు.

రాణించిన ఇంటర్ విద్యార్థులు


విద్యార్థులతో కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్ మాచవరపు కోటేశ్వరరావు


విద్యార్థులను అభినందిస్తున్న నలంద కళాశాల సీఈఓ చైతన్య కృష్ణ


విద్యార్థులతో కేఎల్ఆర్ చైర్మన్ నాగమణి

● కృష్ణవేణి విద్యార్థుల ప్రభంజనం

కొత్తగూడెంరూరల్: ఇంటర్ ఫలితాలలో కొత్తగూడెంలోని లక్ష్మీదేవిపల్లి మండలం కృష్ణవేణి కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో కె.హాసిని 468/470 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అదే విధంగా ఎ.భరత్ 467, సాయి సంజన 466, డి.నిఖిల్ 466, వై.స్ఫూర్తి 466, ఎ.వర్షిత 464, ఎల్.అభిజిత్ 464, ఎస్.శివ శంకర వరప్రసాద్ 464, బి. సంహిత 464, షేక్ తమన్నా 463, సయ్యద్ అబ్దుల్ నదీమ్ 463, ఎం.భవిత 462, షేక్ అమ్రీన్ 462, ఎ.లహరి 462 మార్కులు, ఎ.సంతోష్ 462, బి.పూజిత 462, ఎం.గౌతమ్ భరత్ 461, డి.హర్షవర్దన్ సింగ్ 461, కె.తమాష్ 460 మార్కులు సాధించారు. బైపీసీలో బి.జ్యోతి 438/440 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థాయిలో నిలిచారు. అదేవిధంగా పి. సిరిమహాలక్ష్మి 437, టి.క్షరజ 436, కె.నవ్యశ్రీ 435 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో కె.సాయి కిరణ్ 989/1000 మార్కులు, ఎమ్.సాత్విక్ 988, ఎల్.పూజిత 987, షేక్ అయేషా తరన్నుమ్ 987 మార్కులు సాధించారు. ఎంపీసీలో జి.చందన ప్రియ 986/1000 మార్కులు సాధించింది. విద్యార్థులకు కళాశాల డైరెక్టర్లు మాచవరపు కోటేశ్వరరావు, గొల్లపూడి జగదీష్, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణకిశోర్ అభినందించారు.

● నలందకు స్టేట్ ర్యాంకులు..

ఇంటర్ ఫలితాలలో నలంద జూనియర్ కళాశాల విద్యార్థులు స్టేట్ ర్యాంకులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ లిక్కి విష్ణుత్ 468/470 మార్కులతో స్టేట్ ఫస్ట్‌గా నిలిచాడు. షెయిక్ రుబీనా 467, గొడుగు గ్రీష్మ 467, షెయిక్ నగీన సాఫియా 467, ధరావత్ సింధు 466, సాయి ప్రియ వర్షిని 466, రౌతు ప్రసన్న లక్ష్మీ 466, కె.భానుప్రకాష్‌రెడ్డి 465 మార్కులతో స్టేట్ టాపర్స్‌గా నిలిచారు.

జూనియర్ బైపీసీలో భావన శ్రీ లక్ష్మి 436/440, తాడిపర్తి జాన్సీ 436, మహమ్మద్ మహినూర్ 435, మహమ్మద్ సుమయ 434, జోగేందర్ 434, మార్కులు సాధించారు. సీఈసీలో కె.చర్వితశ్రీ 452/500 మార్కులు సాధించింది. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో పగడాల సాయి మనోజ్ 989/1000, గుబ్బా పావని 989, జి.సాయిచరణ్ 988, జంగా వర్ష 988, గులామ్ శాహిర్ అన్సారి 987, బి.నవన్ 986, పి.సేహ్నా 986, కె.వరుణ్ 986 మార్కులు సాధించారు. సీనియర్ బైపీసీలో జ్ఞాన చరిత 989, బి.సాయి సమైఖ్య 983 మార్కులు సాధించారు. సీనియర్ ఎంఈసీ నోముల రాజేష్ 942 మార్కులు సాధించాడు.

● సాహితీ కళాశాల సత్తా...


శ్రీజను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం


శ్రీలక్ష్మి, సీఈసీ 426/470, ప్రభుత్వ కళాశాల


వరుణ్‌కుమార్, ఎంపీసీ 64/470, శ్రీచైతన్య కళాశాల

ఇల్లెందు: పట్టణంలోని సాహితీ జూనియర్ కళాశాల విద్యార్థులు స్టేట్ ర్యాంకులు సాధించారు. ఎంపీసీ ద్వితీయ గొర్రె శ్రీజ 990/1000 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకర్‌గా నిలిచింది. ప్రథమ సంవత్సరం ఎంపీసీ శివానీ గుప్తా 467/470 రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించాడు. బైపీసీలో ఎస్‌కే సోహెల్ 435/470 రాష్ట్రస్థాయి మూడో స్థానం పొందాడు. సీఈసీ ఆసియా 474/470 మార్కులు సాధించారు. విద్యార్థులకు కళాశాలలో డైరెక్టర్లు ఎంసీ నాగిరెడ్డి, ఎం.శ్రీనివాస్, సుధాకర్, ప్రిన్సిపాల్ గుజ్జర్లపూడి రాంబాబు అభినందించారు.

● గురుకులంలో ఉత్తమ ఫలితాలు


బి.మైథిలి


జె.కళ్యాణి


ఎస్.శైలజ


జి.ప్రవీణ


దివ్యాంకిత


రేఖ

ఇల్లెందురూరల్: మండలంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 130 మంది హాజరు కాగా 109 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో ఎస్.శైలజ 466/470 రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం, ఎంపీసీలో జి.ప్రవీణ 461/470, బైపీసీలో కె.సౌమ్యశ్రీ 429/440, సీఈసీలో డి.దివ్యాంక 474/500, హెచ్ఈసీలో రేఖ 471/500, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో బి.మైథిలి 968/1000, బైపీసీలో జె.కళ్యాణి 971, సీఈసీలో స్వప్న 949, హెచ్ఈసీలో వర్షిణి 934 మార్కులు, ఎంపీసీలో లావణ్య 950, బైపీసీలో పూజ 934 మార్కులు, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో శివాణి 447/470 మార్కు సాధించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, అధ్యాపకులు అభినందించారు.

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర సీఓఈ కళాశాల విద్యార్థులు టాపర్లుగా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంటర్ ద్వితీయ ఎంపీసీ వి.సాయి కుమార్ 956/1000, బైపీసీలో ఎం.అజయ్ 865, ఇంటర్ ప్రథమ ఎంపీసీలో డి.లోకేష్ 462/470, బైపీసీలో 424/440 మార్కులు సాధించారు.

● శ్రీ చైతన్య విద్యార్థుల హవా..

ఇల్లెందు: జూనియర్ ఎంపీసీలో బి.వరుణ్ కుమార్ 464/470, బైపీసీలో బి.పావని 424/470 సాధించారు. సీనియర్ ఎంపీసీలో పి.నవ్య 963/1000, బైపీసీలో జి.నాగేశ్వరి 943/1000 సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ పత్తి శ్రీనివాస్ అభినందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీలో శ్రీలక్ష్మి 426/470 మార్కులు సాధించింది.

● మైనారిటీ గురుకులం విజయదుందుభి..

పాల్వంచ: ఇంటర్ ఫలితాల్లో పాల్వంచలోని కొత్తగూడెం మైనారిటీ గురుకుల బాలికల కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరం పి.శ్వేత 464/470, ఎస్‌కె.తజ్మా 459, ఎం.కావ్య 433, బి.ఇందు 431, ఎస్‌కె.ఇష్రత్ 417, బైపీసీలో ఎస్‌కే అఫ్షియా 405, యామిని సుప్రియ 403, ద్వితీయ ఎంపీసీ ఎండీ హినీ కౌసర్ 963/1000, ఎస్‌డీ నిహారన్ 917, ఎన్.జయశ్రీ 900, బైపీసీలో 960, వి.కావ్య 919, కె.శ్రావణి 904 మార్కులు సాధించారు.

● కేఎల్ఆర్ విద్యార్థుల ప్రతిభ...

ఎంపీసీ ఇంటర్ ద్వితీయ మోర ప్రసన్న 945, కొమ్మ శైలజ 936, ఎంపీహెచ్‌డబ్ల్యూఓ కల్యాణి 927, భూక్యా రాజేశ్వరి 907, ఎంఎల్‌టీలో కాటిరేగుల జ్యోత్స్న 941, సీఈసీ జిమిడి జగదీశ్ 907, మొదటి సంవత్సరం ఎంపీసీలో గ్రంధి యశస్విని 413, బైపీసీలో పంగి కల్వరి 486, ఎంఎల్‌టీలో షేక్ అన్సారి 486, సీఎస్ఈలో దామర్ల సాయిగణేశ్ 497 మార్కులు సాధించారు. వీరిని చైర్మన్ కె.నాగమణి, ప్రిన్సిపాల్ నర్సింహారావు అభినందించారు.

29న ఇసుక వేలంపాట

పాల్వంచరూరల్: పట్టుబడిన ఇసుకను 29న తహసీల్‌లో వేలంపాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వివేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.500 చెల్లించి పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

పేదల పక్షాన నిలబడేది ఎర్రజెండానే..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు


సింగరేణి(కొత్తగూడెం): పేదల పక్షాన నిలబడి వారి హక్కుల సాధనకు పోరాడేది ఎర్రజెండా అని, ఎర్రజెండా బలపడితేనే పేదలు, శ్రామికవర్గానికి న్యాయం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మే డే వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని శేషగిరిభవన్‌లో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యతో కలిసి పాల్గొన్నారు. కూనంనేని మాట్లాడుతూ... స్వాతంత్ర్య భారతంలో పోరాడి, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను బీజేపీ కాలరాస్తోందని ఆరోపించారు. వంగా వెంకట్, రమణమూర్తి, జి.వీరస్వామి, నరాటి ప్రసాద్, జె.గట్టయ్య, రాములు, రాము, వాసిరెడ్డి మురళి, మునిగడప వెంకటేశ్వర్లు, కంచర్ల జమలయ్య, పారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గోనె మణి, క్రిస్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌టీఆర్ కేసు ఉన్నా కంచె వేసి భూఆక్రమణ..

ఇల్లెందు: వివాదాస్పద భూమిలో అక్రమంగా కంచె నిర్మాణం చేపట్టిన గిరిజనేతరుడిపై చర్యలు తీసుకోవాలని, కోర్టు తీర్పు వచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టకుండా చూడాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొగ్గెల రామస్వామి, తాటి మధు కోరారు. బుధవారం కలెక్టరేట్, ఐటీడీఏ పీఓ కార్యాలయంలో, ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ... 21 ఫిట్ తిలక్ నగర్ ఏరియాకు చెందిన కన్నయ్య, గోపాల్‌లకు మధ్య గల భూ వివాదం ఆర్డీఓ కోర్టు పరిధిలో ఎల్‌టీఆర్ కేసు పెండింగ్‌లో ఉందన్నారు.

ఆర్డీఓ కోర్టులో పెండింగ్‌లో ఉన్నా అక్కడ ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి భూ ఆక్రమణకు పాల్పడ్డారని తెలిపారు. తక్షణం అధికారులు జోక్యం చేసుకుని కేసు పరిష్కారం అయ్యే వరకు భూమిలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

చెక్‌డ్యాం నిర్మాణాలను పర్యవేక్షించండి


చెక్ డ్యాం పనులు జరుగుతున్న దృశ్యం

జూలూరుపాడు: గుండ్లరేవు, అన్నారుపాడు, చీపురుగూడెం గ్రామాల సమీపంలోని పెద్దవాగుపై చెక్ డ్యాం నిర్మాణాలు చేపట్టారు. ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో మూడు చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒక్కో చెక్ డ్యాం రూ.1.30 కోట్ల ఖర్చుతో నిర్మించనున్నారు. ఈ చెక్‌డ్యాంల నిర్మాణ పనులు ప్రారంభం నుంచి కాంట్రాక్టర్ వేగవంతం చేశాడు. రూ.కోట్ల వ్యయంతో చేపట్టిన చెక్ డ్యాంల నిర్మాణ పనులు ఇరిగేషన్ ఇంజనీర్ల పర్యవేక్షణలో జరగాల్సి ఉండగా, అందుకు భిన్నంగా కొనసాగుతున్నాయని రైతులు, స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. చెక్‌డ్యాం నిర్మాణ పనుల పట్ల ఇరిగేషన్ ఇంజనీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. చెక్‌డ్యాంల నిర్మాణాల కోసం ఇరిగేషన్ ఇంజనీర్లు భూ సర్వే చేసి గుర్తించిన ప్రాంతాలు కూడా వివాదస్పదంగా మారుతున్నాయని చెప్పడానికి ఇటీవల చీపురుగూడెం రైతులు చెక్‌డ్యాం పనులు అడ్డుకున్న సంఘటనలు నిదర్శనం. ఇరిగేషన్ అధికారులు ముందుగా గుర్తించిన ప్రాంతంలో కాకుండా రైతులు అనుమతి లేకుండా మరో ప్రాంతంలో నిర్మించడం వల్ల వ్యవసాయ భూములు దెబ్బతింటాయని అడ్డుకోవడం జరిగిన విషయం తెలిసిందే. ఈ సమయంలో కూడా సంఘటనా స్థలానికి ఇరిగేషన్ ఇంజనీర్లు వచ్చి నచ్చచెప్పకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహానికి కారణమైనప్పటికీ సంబంధిత అధికారులు తమ తీరు మార్చుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెక్‌డ్యాంల నిర్మాణ పనులు ఇరిగేషన్ ఇంజనీర్ల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

కేజీబీవీలో నూరుశాతం ఫలితాలు


ఎస్.విజ్ఞశ్రీ, ఎంపీసీ, 936/1000


బి.పల్లవి, ఎంపీసీ, 450/470

జూలూరుపాడు: బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో జూలూరుపాడు కేజీబీవీ జూనియర్ కళాశాల విద్యార్థినులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ ఎస్.విజ్ఞశ్రీ ఎంపీసీలో 936, బైపీసీలో కె.మాధురి 920 మార్కులు సాధించారు. ఇంటర్ ప్రథమ ఎంపీసీలో బి.పల్లవి 450, జె.కావేరి బైపీపీ 423 మార్కులు వచ్చాయి. కేజీబీవీ కళాశాలకు చెందిన సెకండ్ ఇయర్ విద్యార్థులు 30 మందిచ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 31 మంది పరీక్ష రాయగా అందరూ పాసై 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

సాధన విద్యార్థుల విజయఢంకా...

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్ష ఫలితాల్లో జూలూరుపాడు సాధన జూనియర్ కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కె.పావని 933/1000చ సీఈసీలో చర్ల శిరీష 903 మార్కులు సాధించారు. 96 మంది విద్యార్థులు రాయగా అందరూ పాసయ్యారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ తంగెళ్లపల్లి తేజశ్విని ఎంపీసీలో 450/470 మార్కు సాధించింది. 79 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 76 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రిన్స్‌పాల్ కె.వెంకటేశ్వర్లు, అధ్యాపకులకు విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ విద్యార్థుల విజయభేరి


ప్రదీప్‌కుమార్


సాయి కుమార్


లకావత్ శివరాణి


కుంజా సౌజన్య


బి.శిరీష


గుగులోత్ దేవేందర్


బాణోతు గణేష్


గుగులోత్ వేణు


గుగులోత్ నవీన్

టేకులపల్లి: బుధవారం ప్రకటించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్ష ఫలితాల్లో టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు మొత్తం 117 మంది పరీక్ష రాయగా 37 మంది ఉత్తీర్ణులై 31.6 శాతం సాధించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 91 మంది పరీక్ష రాయగా 47 మంది ఉత్తీర్ణులై 51.6 శాతం సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఇస్లావత్ ప్రదీప్ కుమార్ 905, భూక్య సాయి కుమార్ 875, కుంజా సౌజన్య 850, బానోతు స్పందన 799, గుగులోత్ నవీన్ 779, గుగులోత్ దేవేందర్ 700 మార్కులు సాధించారు. బైపీసీలో లకావత్ శివరాణి 865 మార్కులు సాధించింది. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో బానోతు గణేష్ 417, సీఈసీలో గుగులోత్ వేణు 387 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, అధ్యాపకులు అభినందించారు. టేకులపల్లిలోని కస్తూర్బా కాలేజీలో ప్రథమ సంవత్సరం బాలికలు 10 మంది పరీక్ష రాయగా ఆరుగురు, ద్వితీయ సంవత్సరం 13 మంది పరీక్ష రాయగా 11 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో బి.శిరీష 815, ప్రథమ సంవత్సరం బైపీసీలో కె.సమ్మక్క 361 మార్కులు సాధించారు.

గురుకుల కళాశాలల్లో తగ్గిన ఉత్తీర్ణత

పాల్వంచరూరల్: ఇంటర్మీడియట్ ఫలితాలలో గురుకుల బాలికల కళాశాల, బాలుర, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం తగ్గింది. బుధవారం ప్రకటించిన ఫలితాలలో సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలలో ద్వితీయ ఇంటర్‌లో 74మంది పరీక్ష రాయగా 63మంది ఉత్తీర్ణత సాధించగా 11 మంది ఫెయిలయ్యారు. 85.13శాతం ఉత్తీర్ణత సాధించారు. గతేడాది 90శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషన్‌లో 37మంది పరీక్ష రాయగా 36మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం 76 మంది పరీక్ష రాయగా 45మంది ఉత్తీర్ణలయ్యారు. 31మంది ఫెయిల్ అయ్యారు. 59.21 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషన్‌లో 39 మంది పరీక్ష రాయగా 33 మంది ఉత్తీర్ణులయ్యారు. 59.21 ఉత్తీర్ణత సాధించగా గతేడాది 88శాతం ఉత్తీర్ణత సాధించారు.

తాగునీటి సౌకర్యం కల్పించండి

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీ బస్తీ రాజీవ్ నగర్ తండాలో గుడిసెవాసులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ లావణ్యకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు అబ్దుల్ నబీ, మన్యం మోహన్‌రావు మాట్లాడుతూ.. వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి ఉండకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా స్థానిక అధికారులు తాగునీటి సౌకర్యం కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. గతంలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రజాప్రతినిధులకు, మండల పరిషత్, గ్రామపంచాయతీ అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. స్పందించిన అధికారులు సర్వే చేసినప్పటికీ తాగునీటిపై పట్టింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాందాస్, హుస్సేన్, పాషా, యాకూబ్, ఖాదర్, ప్రమీల, సంతోష్, భవానీ పాల్గొన్నారు.

పల్లెల్లో తాగునీటి కష్టాలు


- ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని మిషన్ భగీరథ పైపులైన్
- అవస్థ పడుతున్న గిరిజనులు
- పట్టించుకోని అధికారులు


ఎలుకలొడ్డులో మిషన్ భగీరథ ట్యాంకు


గుండ్లరేవు సమీపంలో నిర్మించిన నీటి సంప్

జూలూరుపాడు: మండలంలోని గుండ్లరేవు గ్రామ పంచాయతీ రాంపురంతండా, ఎలుకలొడ్డు గ్రామాలకు గిరిజనులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ప్రతీ ఇంటికి నల్లా ద్వారా మంచినీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఐదేళ్లుగా మిషన్ భగీరథ నీటి సరఫరాకు నోచుకోక గిరిజనులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాంపురంతండా, ఎలుకలొడ్డు గ్రామాల్లోని మిషన్ భగీరథ పైప్‌లైన్ లికేజీలతో ట్యాంకులకు నీళ్లు ఎక్కపోవడంతో ఐదేళ్లుగా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. రెండు గ్రామాల్లో ఇంటింటికీ నల్లాల కనెక్షన్ కూడా ఇవ్వలేదు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి పరఫరా కాకపోవడానికి సంబంధిత అధికారులే కారణమని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఐదేళ్లుగా ఒక చుక్క నీరు కూడా రాలేదని, మిషన్ భగీరథ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయని చెబుతున్నారు. రెండు గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సమస్య పరిష్కారం కోసం పది నెలల క్రితం గుండ్లరేవు గ్రామ సమీపంలో నీటి సంపు నిర్మించారు. ఇటీవల ట్రయల్ రన్ నిర్వహించగా మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడం, లికేజీల కారణంగా నీటి సరఫరా నిలిపివేయడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. దీంతో సంబంధిత అధికారులు పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టారు. అయితే మిషన్ భగీరథ ట్యాంకుల్లో నీటిని నింపుతున్నా ఇంటింటికీ నల్లాల ద్వారా సరఫరా కావడం లేదని గిరిజనులు వాపోతున్నారు. ఎలుకలొడ్డులో గతంలోని రక్షిత మంచినీటి పథకం (డీపీ) నీటి సరఫరా అవుతుండగా, రాంపురంతండాలో వ్యవసాయ బోరు బావుల నీటిని పైపులు వేసుకొని పట్టుకోవాల్సిన దయనీయ పరిస్థితి ఉంది. అదేవిధంగా రాంపురంతండాలో రెండు చేతి పంపులు ఉన్నా తాగడానికి ఉపయోగపడకపోగా, ఎలుకలొడ్డులో చేతి పంపులు మూలనపడ్డాయన్నారు. రాంపురంతండాలో 355 కుటుంబాలు ఉండగా, ఎలుకలొడ్డు గ్రామంలో 40, మొత్తం 395 గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మిషన్ భగీరథతో తాగునీటి సమస్య తీరుతుందని ఎంతో ఆశపడ్డామని చివరకు నిరాశే మిగిలిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై జూలూరుపాడు మిషన్ భగీరథ ఏఈ సురేష్‌ను వివరణ కోరగా ప్రస్తుతం మిషన్ భగీరథ నీళ్లు మెయిన్ పైప్‌లైన్ ద్వారా ట్యాంకులు నింపుతున్నట్లు చెప్పారు.


తాగునీరు రావడం లేదు...



మిషన్ భగీరథ నీళ్ల కోసం ఐదేళ్లుగా ఎదురు చూస్తున్నాం. ఇళ్లలో నల్లాల కనెక్షన్ కూడా ఇవ్వలేదు. వ్యవసాయ బోరుబావి నుంచి పైప్ వేసుకొని నీళ్లు పట్టుకున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీళ్లు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– ధరావత్ తావిర్యా, రాంపురంతండా


అధికారులు స్పందించాలి...



పాఠశాల ఎదుట ఉన్న చేతి పంపు నీళ్లు వాడుతున్నాం. మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతోపాటు, లికేజీలతో నీళ్లు రావడం లేదని అధికారులు చెపుతున్నారు. మరమ్మతులు చేసి, మిషన్ భగీరథ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– బానోత్ రుక్మిణి, రాంపురంతండా

ట్యాంకు నిరుపయోగం...



మిషన్ భగీరథ నీళ్లు సరఫరా చేయాలి. ప్రస్తుతం గతంలోని రక్షిత మంచినీటి పథకం బోరు బావి నీళ్లు వాడుతున్నాం. మిషన్ భగీరథ ట్యాంకు కట్టారు గానీ, ఆ ట్యాంకు నుంచి నీళ్లు ఇళ్లలోకి రావడం లేదు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలి.

– కోరం చుక్కమ్మ, ఎలుకలొడ్డు